# ఆమె నవ్వింది

## మినీ కథ

కె.బి.కృష్ణ

రాత్రి పదకొండయింది. హైదరాబాదు నగరాన్ని ఎన్నో బస్సులతోపాటు ఒక సెమిలగ్జరీ బస్ వదిలిపెడుతూంది.

సెమిలగ్జరీలో రెండవ లైనుతో చివర ఒక యువకుడు, అతనికి ప్రక్కనే ఆ చివర ఒక అమ్మాయి కూర్చుని వున్నారు.

అమ్మాయి తెల్లని బట్టలలో 'వెన్నెలకన్య' లావుంది. సెమిలగ్జరీ కుషన్‌లో వొదిగిపోయిన ఆమె వొంపు సొంపులు ప్రక్కనే కొంచం యడంగా వున్న అబ్బాయికి మత్తెక్కిస్తున్నాయి.

ఆ అమ్మాయి నాగార్జున సాగర్‌కి టికెట్ తీసుకుంది.

"మీరు సాగర్ ఎందుకు వెళ్తున్నారు ?" అన్నాడా అబ్బాయి.

ఆ అమ్మాయి మాట్లాడలేదు.

అతను ప్రక్కనుండి కనపడే ఆ అమ్మాయి వొంపు సొంపుల వయ్యారాలను కళ్ళతో తాగుతూ ఆ వయసు లహరికి, అయిస్కాంతానికి ఇనుప రజను అతుక్కుపోతున్నట్లుగా అయిపోతున్నాడు.

"మిమ్మల్నే, సాగర్ నేనూ వెళ్తున్నాను. నాకు సాగర్ తెలియదు. మా అన్నయ్య అక్కడ వున్నాడు అందుకని అడిగాను"

"సాగర్ మావూరే. బైది బై మీపేరు ?-" అందా చిలక.

"వేణు. మీపేరు కోకిలా ?"

ఆమె నవ్వింది. "కాదు"

"లావణ్యా ? మీ గొంతునుబట్టి, లేదా మీ శరీరాన్ని బట్టి "లావణ్య" అయినా అయివుండాలి అనుకున్నాను."

"హద్దులు మీరుతున్నారు మీరు. మన పరిచయం ఇప్పుడే అయింది.

"అవును మనం ఇప్పుడే హైదరాబాదు సరిహద్దులు దాటుతున్నాం"

"ఓ. కే." అని సీటు వెనక్కువాలి నిద్ర కోసం ప్రయత్నించసాగింది.

వేణు మనసుని ఆమె సౌందర్యం, గోపి కలనలరించిన వేణుగానంలా అలరిస్తూంది.

ఇబ్రహీంపట్నంలో "కూల్ డ్రింక్" అందిస్తూ-

మల్లేపల్లిలో "చాయ్" అందిస్తూ-

"లావణ్య" స్పర్శానుభూతిని పొందాడు. ఆమె కొనగోళ్ళు తగిలినప్పుడల్లా మేగ్నెటిక్ యాక్షన్‌లా తల్లడిల్లిపోయాడు వేణు.

సాగర్ దగ్గర పడుతోంది. ఆకాశంలో తారకల్లా మూడు కాలనీల్లో లైట్లు మిలమిలా మెరుస్తున్నాయి. బస్సులో లైట్లు వెలిగాయి. లావణ్య నిద్రలో అస్తవ్యస్తంగా సీట్లో వూగుతూంది. తొలగిన పైట దాటున, తెల్లగా, పాల మీగడ నురుగులా మెరిసిపోతున్న ఆమె శరీరం, ఆ సోయగం ఎవడు సొంతం చేసుకుంటాడోనని, అసూయపడసాగేడు వేణు.

ఆఫీసర్స్ క్లబ్ దగ్గర ఆగింది బస్. వేణు చేతిలో ఒక స్లిప్ పెట్టి దిగిపోయింది లావణ్య.

"మా ఇంటి నెంబరు ఇది. రేపు సాయంత్రం ఒక్కరూ రండి. లావణ్య"

వేణుకు బోయింగ్ 787లో వెళ్తొన్నట్లుగా వుంది. బస్సుదిగి తన అన్నయ్య ఇంటికి వెళ్ళి, లావణ్యని ఊహల్లో పొందుపరచుకుని నిద్రపోయాడు.

తెల్లవారింది.

ఆ సాయంత్రం వరకు ఎలాగడిపాడో వేణుకు తెలియదు. క్వార్టర్స్‌వేపు బయలుదేరాడు. ఒకో క్వార్టర్ నంబర్ చూసుకుంటూ నడుస్తూ సాగాడు. ఐదు క్వార్టర్సు దాటితే ఆమె ఇల్లు వస్తుంది.

అరె! ఎట్టిటి బోర్డు వుందేమిటి ? బహుశః ఆళ్ళనాన్నగార్కి ఎట్టినిరరంగంటే ఇష్టంఅయివుండచ్చు.

ఆ క్వార్టర్ దగ్గరగా వెళ్ళేడు.

ఆ క్వార్టరు పోలీస్ అవుట్ పోస్ట్ ! యూనిఫాంలోవున్న కానిస్టేబుల్‌నిచూసి, తడబడి, వేణు వెంటనే వెనుదిరగడం తప్పితే ఇంకేం చేయగలడు ?



### ఇది నిజం

బ్రిటిష్ పోస్ట్ ఆఫీసుల్లో పిల్లులను పెంచి పోషించడానికి ప్రభుత్వం గ్రాంట్ ఇస్తుంది. ఇది ఎలుక బారినుండి తపాలా విభాగాన్ని సంరక్షించడానికే !